
నాదెళ్ళ రాము



# తండ్రికి తగ్గ తనయుడు

"అయితే ప్రేమించి, పెళ్ళి చేసుకునేటంత మొనగాడివయ్యావన్నమాట. బాగానే వుంది. ఇంతకీ వాళ్ళు ఏమాత్రం ఇచ్చుకోగలరట?" వెంకట్రావుగారు సిగరెట్ పొగ వదులుతూ అడిగారు ఎదురుగా తల దించుకుని వినయం ఒలకబోస్తున్న భాస్కర్ నామధేయుడ్ని.

"అదేమిటండీ! అసలా అమ్మాయిది ఏ కులమో. బావుంటుందో బావుండదో. వాళ్ళవాళ్ళు ఒప్పుకుంటారో లేదో, ఏమీ కనుక్కోకుండా ఏకంగా పెళ్ళి మాటలు మాట్లాడేస్తున్నారు." నిష్ఠూరంగా అంది పక్కనే కూర్చున్న సూర్యవతి.

"ఖచ్చితంగా ఆ సంగతి తెల్సుకున్నాకే వీడు ఆ అమ్మాయిని ప్రేమించి ఉంటాడు. కనుక మనం ఆ సంగతి ప్రత్యేకంగా అడగక్కర్లేదు. వాళ్ళ వాళ్ళు ఒప్పుకోవటం అంటావా. ఏం? మన వాడికేం తక్కువని? ఇక కులం సంగతి నాకేం పట్టింపు లేదు. నాకు కావల్సింది ఎంత కట్నం ఇస్తారూ అన్నది. నేనడిగినంత ఇవ్వగల్గితే ఏ కులమింటి పిల్లయినా నాకేం అభ్యంతరం లేదు."

"బాగానే ఉంది మీ తీరు" రుసరుస లాడింది సూర్యవతి.

"సర్లే, నీమాటెందుకు కాదనాలి? నీకు కావల్సిన విషయాలు నీ సుపుత్రుడ్ని అడిగి తెల్సుకో. తరువాత నా సందేహాలు తీర్చుకుంటానులే" పక్కనే వున్న పేపరు ముఖాన్కి అడ్డం పెట్టుకున్నారు వెంకట్రావు.

సూర్యవతి ప్రశ్నార్థకంగా కొడుకు వంక చూసింది.

"ఆ అమ్మాయి పేరు సరోజ. కలెక్టర్ ఆఫీసులో ఉద్యోగం. కులం మనదే. వాళ్ళ వాళ్ళు ఒప్పుకున్నాకే మిమ్మల్ని అడుగుతున్నాను" భాస్కర్ చెప్పాడు.

"సరే నీ వరకూ అన్ని విషయాలు తెలిపోయాయి" అన్నారు వెంకట్రావుగారు భార్యతో. చేతిలోని పేపర్ టీపాయ్ మీద పడేస్తూ సిగరెట్ పొగ గుప్పున వదులుతూ కొడుకు వంక చూసి "కూర్చో నాయనా! మనం మాట్లాడ వలసింది చాలా వుంది గదా. ఇక అసలు విషయాన్కి వద్దాం. మళ్ళీ అడుగుతున్నాను చెప్పు. వాళ్ళు మనతో తూగుతారా?"

"పరువుప్రతిష్ఠల విషయంలో అయితే మాత్రం పర్వ లేదు నాన్నగారూ?"

"అతితెలివి తేటలు ఒలకబోయకు. నేనడిగింది ఏమాత్రం కట్నం ఇచ్చుకోగలరని".

"అయితే మీరు కట్నం తీసుకోవాలనుకుంటున్నారా నాన్నగారూ!".

"ఏం వాళ్ళు కట్నం ఇవ్వలేరా? అలా అయితే ఈ పెళ్ళి అవదు. బుద్ధిగా మేము చూసిన పిల్లను చేసుకో".

"అబ్బే నా ఉద్దేశం అదికాదు నాన్నగారూ. మనకేం తక్కువని వాళ్ళ దగ్గర కట్నం తీసుకోవడం అని".

"అది నీ ఉద్దేశం. అసలు కిటుకు అక్కడే ఉందిరా అబ్బాయ్. మనకేం తక్కువ లేదు. కనుక మనం మరింత ఎక్కువ కట్నం తీసుకుంటాం."

"కాని నేను కట్నం తీసుకోవాలనుకోవటం లేదు"

"ఆహా! బయలుదేరాడండి ఆదర్శ పురుషుడు. ఒక మాట వినరా సుపుత్రా. నువ్వు పుట్టిన దగ్గరినుంచి బి.ఎ. బిఎల్., పొసై ప్రాక్టీసు పెట్టేవరకూ అయిన ఖర్చులన్నీ ఎప్పటికప్పుడు రాసి ఉంచాను ఎందుకైనా మంచిదని. ఆ ఖర్చులు కాక, మా కొడుకుగా పుట్టినందుకు నువ్వు మాకేదో ఋణపడి ఉంటావు గదా. అదంతా లెక్కచూస్తే నీ ఖరీదు పది లక్షలు. అసలు మొన్న వచ్చిన విజయవాడ వాళ్లు కూడా పది లక్షలు ఇస్తామన్నారు. సరే ఇంతలో నువ్వేదో ప్రేమించానని అంటున్నావు కనుక ఎనిమిది లక్షలకు ఏమాత్రం తగ్గను. నువ్వు ప్రేమించిన పిల్ల తాలూకు వాళ్ళు ఆ మాత్రం ఇచ్చుకోగలరో లేదో తెల్సుకున్నాకే అప్పుడు మాట్లాడు. మరోమాట. ఒకవేళ ఈ పిల్ల వాళ్ళు నేనడిగినంత కట్నం ఇచ్చుకో లేకపోతే ఆ విజయవాడ సంబంధం ఖాయం చేసేస్తాను. అదీ గుర్తుంచుకో" కోపంగా అన్నారు వెంకట్రావుగారు.

"అంటే నన్ను సంతలో వస్తువులా అమ్మాలనా మీ ఉద్దేశం?" ఆవేశంగా అడిగాడు భాస్కర్.

"అలా ఎందుకనుకుంటావురా? అయినా ఈయన చెప్పే తీరూ అలానేవుంది. నీకొచ్చే కట్నం డబ్బైనా, మన కున్న ఆస్తిఅయినా మేమేం కట్టుకుపోతామా? మా తర్వాత నీకే గదా. ఏదో నువ్వు సుఖపడతావనేగదా మేం చెప్పేది" సూర్యవతి అంది.

భాస్కర్ ఏం మాట్లాడలేదు. విసురుగా లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"వాడిదంతా కుర్రతనం. మీరు మాత్రం కట్నం విషయంలో ఖచ్చితంగా ఉండండి" భర్తకు సలహా ఇచ్చింది.

ఈ మాట భాస్కర్‌కి బాగానే వినిపించింది. తల్లితండ్రుల వరస చూస్తుంటే కట్నం వంక చెప్పి ఈ పెళ్ళి జరగనిచ్చేలా లేరు. తను తల్లితండ్రులను ఎదిరించి సరోజను పెళ్ళి చేసుకోవాలంటే ఏదో బెరుగ్గావుంది. సాధ్యమైనంతవరకూ తన పెళ్ళి తల్లిదండ్రుల ఇష్టప్రకారమే జరగాలి. వాళ్ళకు ఒక్కగా నొక్క కొడుకు తను. జీవితంలో అతి ముఖ్యఘట్టమైన పెళ్ళిని తల్లిదండ్రులని బాధపెడుతూ చేసుకోవటం తనకు ఆనందం ఇవ్వదు. అలాఅని తనకు అన్నివిధాలా అనుకూలమైన సరోజనూ వదులుకోలేడు. ఎట్లా ఈ చిక్కుముడి విప్పటం? ఆలోచనల్లో మునిగాడు భాస్కర్.

సరిగ్గా 10 నిముషాల తర్వాత ఏదో ఆలోచన తట్టింది. వెంటనే హాలులోకి వచ్చాడు. వెంకట్రావుగారూ, సూర్యవతి అలాగే కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ ముందు నిలుచుని "అయితే నాన్నగారూ! వాళ్ళు కట్నం ఇస్తే చాలుకదా. కట్నం ఇస్తే మరేం వంకలు పెట్టరుగా?"

"నువ్వు అలాంటి అనుమానమేం పెట్టుకోవద్దు. వాళ్ళు కట్నం నేనడిగినంత ఇచ్చేట్లయితే మహదానందంతో మీ పెళ్ళి జరిపిస్తాను సరేనా" హుందాగా అన్నారు.

"థాంక్స్ నాన్నగారూ మరి నేను వెళ్ళి ఈ విషయం సరోజతో మాట్లాడి వస్తాను. వాళ్ళ వాళ్ళు మీరడిగిన కట్నం ఇచ్చేస్తోమత ఉన్నవాళ్ళయితే రేపు వాళ్ళ ఇంటికి వెడదాం!" హుషారుగా బయటికి వెళ్ళిపోయాడు.

* * *

"సరోజా ఇదీ అసలు సంగతి"అన్నాడు భాస్కర్.

సరోజ ముఖం విచారంగా అయింది.

"కాని అంత కట్నం మా వాళ్ళు ఇచ్చుకోలేరు భాస్కర్-" ఆమె కంఠం వణికింది- భాస్కర్ నవ్వాడు.

"మరీ అంత దిగులు పడకు. అంతేకాదు అసలే మాత్రం కట్నం ఇచ్చినా తీసుకోవటాన్కి నేనొప్పుకోను. ఇంతకీ నేనో ఉపాయం ఆలోచించాను. జాగ్రత్తగా విను" అని తన ప్లాను వివరించి చెప్పాడు. "ఎలా ఉంది నా ప్లాన్?" అడిగాడు.

"కాని భాస్కర్ అలా చేయడం బాగోదేమో. వాళ్ళ మనసులు బాధపెట్టినట్లు అవుతుంది."

"మరి వాళ్ళు కట్నం అడగడం బావుందేం? నీకేం భయం లేదు. ఇదంతా నాటకమే కదా! ఇంతకూ మీ అన్నయ్యని నేచెప్పినట్లు అడగమను. నేనూ చెబుతాననుకో. సరే ఇక పోదామా?" స్కూటర్ స్టార్ట్‌చేస్తూ అన్నాడు భాస్కర్.

సరోజ ఆలోచిస్తూనే అంగీకారంగా తల ఊపి వెనుక కూర్చుని అతని నడుం మీద చేయి వేసింది. స్కూటర్ పడుచుదనపు వేగంతో పరుగులు తీసింది.

"రేపు పెళ్ళిచూపులకు సరోజ వాళ్ళింటికి వెళుతున్నాం నాన్నగారూ" అన్నాడు భాస్కర్ సరోజని వాళ్ళింటి దగ్గర దించి తిరిగి వచ్చాక.

"అంటే మనం అడిగిన కట్నం ఇవ్వటాన్కి వాళ్ళు ఒప్పుకున్నారన్నమాట!".

"ఆ ఒప్పుకున్నట్లే" విసురుగా లోపలికి వెళ్ళిపోయాడు.

"ఎవరి కోసం ఒప్పుకుంటారు" అనుకుంటూ చిన్నగా నవ్వుకున్నారు వెంకట్రావుగారు.

* * *

మర్నాడు సరోజ ఇంట్లో పెళ్ళిచూపులు- సరోజ అందరికీ నచ్చింది.

"ఇక మిగిలిన విషయాలు కూడా మాట్లాడేద్దాం" అన్నాడు సరోజ చిన్నాన్న.

"అలాగే ఉన్న నిజం చెబుతున్నాను. మా వాడికి పది లక్షలు కట్నం ఇస్తామని విజయవాడ సంబంధం వచ్చింది. కాని మావాడు ప్రేమాదోమా అని చెవి కోసిన మేకలా అరుస్తున్నాడు. కాబట్టి మీకు కొంత డిస్కౌంట్ ఇస్తున్నాను" అన్నారు వెంకటరావుగారు.

"మొహమాటం ఎందుకు సరిగ్గా చెప్పేయండి మీకెంత కావాలో" సరోజ తండ్రి అడిగాడు.

"ఎనిమిది లక్షలు. ఆపైన అన్నిరకాల లాంఛనాలు."

"కాని అమ్మాయి అందమైనది. చదువుకున్నది. పైగా కలెక్టర్ ఆఫీసులో ఉద్యోగం. ఇవన్నీ మీరు ఆలోచించాలి" సరోజ పిన తండ్రి అన్నాడు.

"అమ్మాయి అందం కొరుక్కుతింటామా? చదువంటారా. ఈరోజుల్లో చదువుకోని వాళ్ళెవరు చెప్పండి. ఇక

